

# అద్వైతం

## – శారద (బ్రిస్బేన్)

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

**1991– అక్టోబర్**

డియర్ భానూ,

బాగున్నావా? ఎలా చదువుతున్నావు? నాకు దసరా పండగ సెలవులు ఒక వారం రోజులున్నాయి. వచ్చే శుక్రవారం నేను ఇంటికెళ్తున్నాను. నీకూ వీలైతే శనివారం మధ్యాహ్నం మూడు గంటలకి బ్రిటిష్ లైబ్రరీకి రా.

మనం ఆ రోజు మా ఇంట్లో పార్టీ తరవాత కలవనే లేదు కదా? నీ ఫోన్ నెంబరు నా దగ్గరున్నా, మీ ఇంట్లో ఏమైనా తప్పుగా అనుకుంటారేమోనని నేనెప్పుడూ ఫోన్ చేయలేదు. పైగా నీకు నా హాస్టల్ అడ్రసు ఇవ్వడం మరచిపోయాను. సరే, సెలవులకి ముందు నీకొక ఉత్తరం రాస్తే, మనం ఒక్కసారి కలుసుకోవచ్చుకదా అని ఇలా ఉత్తరం రాస్తున్నానన్నమాట.

యూనివర్సిటీ బాగుంది కానీ, చదువే కొంచెం ఇంటెన్స్‌గా వుంది. ఎప్పుడూ అసైన్‌మెంట్లూ, పరీక్షలతో బాగా బిజీగా వుంచుతున్నారు. అయితే బియ్యే ఇంగ్లీషుకంటే ఎమ్మేలో పరిచయమవుతున్న సాహిత్యం చాలా పై స్థాయిలో వుంది. అంతే కాదు, అస్సైన్‌మెంట్లలోనూ, పరీక్షలలోనూ మా మీద వుండే ఎక్స్పెక్టేషన్లూ పెద్దగానే వున్నాయి మరి. అందుకే ఎక్కువగా హాస్టల్ వదిలి ఇంటికి వెళ్ళలేకపోయాను. అమ్మ, అమ్మామ్మతో ఫోన్లో మాట్లాడుతూనే వున్నాను.

ఇక్కడ డాన్సు ప్రాక్టీసుమాత్రం కుదరటంలేదు. క్లాసులకి కూడా పెద్దగా వెళ్ళటంలేదు. సమ్మర్ హాలిడేస్‌లో మళ్ళీ బాగా ప్రాక్టీసు మొదలుపెట్టాలి.

నువ్వెలా చదువుతున్నావు? ఆశాతో సినిమాలు చూస్తున్నావా?

వుంటా మరి,

శనివారం కలుస్తావు కదూ?

అశోక్

★★★★★★★★★★★★★★★

శనివారం పొద్దున్నే ఆ వుత్తరం నూటా యాభయ్యోసారి చదువుకుంది భాను. ఏదో అర్థంకాని సంతోషం ఆమెలో. ఎందుకో పెదవులపైకి చిరునవ్వూ, గుండెల్లోంచి పాటా తోసుకొని వొస్తున్నాయి.

చాలా రోజులయింది అశోక్‌ని కలిసీ, మాట్లాడీ. యూనివర్సిటీలో ఎమ్మేలో చేరినతరవాత ఇదే మొదటిసారి అతన్నుంచి ఉత్తరం అందుకోవడం. అతన్నుంచి ఎటువంటి కమ్యూనికేషనూ లేక కొంచెం దిగులేసింది, కానీ, ఉత్తరం రాయడానికి అడ్రసు లేదు, మాట్లాడదామంటే ఫోన్ నంబరూ లేదు. ఒకసారి ఊరికే వాళ్ళింటికి వెళ్ళి అతని అడ్రసు అడుగుదామనుకుంది కూడా కానీ, ఏ వంకతో వెళ్ళాలో తోచలేదు.

ఎలాగో మనసు అదుపులో పెట్టుకోని చదువు మీదా, బాడ్మింటన్ మీదా ధ్యాస పెట్టడానికి ప్రయత్నించింది. నాలుగురోజుల క్రితం అశోక్ వుత్తరం చూడగానే మనసంతా చల్లటి గాలి వీచినట్టయింది.

మధ్యాహ్నం అన్నం తిని బట్టల బీరువా ముందు నిలబడి ఆలోచనలో పడింది. ఎప్పట్లాగే జీన్స్ కాకుండా ఇంకేదైనా డ్రస్సు వేసుకోవాలనుకుంది. తెలుపు మీద నీలం పువ్వుల కాటన్ చుడీదార్ వేసుకుంది. చిన్న బొట్టు పెట్టుకొని జడ అల్లుకోని బయల్దేరింది. శనివారం మధ్యాహ్నం టీవీలో వచ్చే ప్రోగ్రాం చూస్తూ వున్న ప్రభావతి భాను వైపు ఆశ్చర్యంగా చూసింది ప్రభావతి.

"ఎక్కడికే బయల్దేరావు? ఆశా వాళ్ళతో సినిమాకేనా?"

"సినిమాక్కాదమ్మా. బ్రిటిష్ లైబ్రరీకి వెళ్ళొస్తాను."

"బ్రిటిష్ లైబ్రరీకా? ఎందుకూ? అదెక్కడుంది?అక్కడ మెంబర్‌షిప్ తీసుకున్నావా?"

"లేదమ్మా, ఇవాళ తీసుకుంటాను."

"ఎందుకిప్పుడు వున్నట్టుండి?"

"అబ్బ, లైబ్రరీ మెంబర్‌షిప్పు కిన్ని ప్రశ్నలేంటమ్మా? మొన్న మా క్లాసులో అందరూ మాట్లాడుకుంటూంటే విన్నా. తీసుకోవాలనిపించింది. పుస్తకాలు బాగుంటే వచ్చే వారం ఇద్దరం కలిసి వెళ్దాంలే!" చెప్పులేసుకుంటూ అన్నది. గేటు బయటికొచ్చి ఆటో కోసం నడుస్తూ, "ఎప్పుడూ లేనిది అమ్మతో అబద్ధం చెప్పాను" అనుకుంది భాను కొంచెం చిరాగ్గా. లైబ్రరీ ముందు ఆటోలోంచి దిగి లైబ్రరీలోకడుగుపెట్టి చూట్టూ వెతికింది భాను. దూరంగా సోఫాలో కూర్చొని ఏదో మాగజీన్ చూస్తున్నా అశోక్‌ని చూడగానే, మొహం మీదికి తోసుకుంటూ వస్తున్న నవ్వును అణచుకుంటూ అటెళ్ళింది. అడుగుల సవ్వడికి ఆమె వైపు చూసి నవ్వుతూ లేచాడు అశోక్.

" హాయ్ అశోక్! ఎలా వున్నావ్?"

"అయాం ఫైన్. నువ్వెలా వున్నావ్? ఏదైనా పుస్తకాలు తీసుకుంటావా? నీకు మెంబర్షిప్ వుందా?"

"లేదు. అయినా నాకు నీ అంత పుస్తకాలు చదివే అలవాటు లేదు. మెంబర్షిప్పు దండగ. అయినా నువ్వు తీసుకోమంటే తీసుకుంటా."

"వొద్దులే. నీకు పుస్తకాలు చదవటం అలవాటు చేస్తా ముందు. ఆ తర్వాత తీసుకుందువు గాని. ఈ పుస్తకాలు చెక్ అవుట్ చేసి బయటికెళ్దాం."

ఇద్దరూ పుస్తకాలు పట్టుకొని బయట నీరెండలోకి నడిచారు.

"కొంచెం కాఫీ తాగుదామా?"

"కాఫీ కాదు! చెరుకురసం తాగుదాం!" రోడ్డు పక్కగా వున్న చెరుకురసం బండి వైపు చూస్తూ అన్నది భాను.

"సరే పద."

చెరుకురసం కొనుక్కొని పక్కనే వున్న బెంచి మీద కూరున్నారు.

"చెప్పు, థర్డ్ ఇయర్ ఇంజినీరింగ్ ఎలాగుంది?"

"బానే వుంది అశోక్. అసలు టెన్షన్ వచ్చే యేడు ! "

"బీటెక్ తరవాత ఏంటి ప్లాన్? ఎంటెక్ చదువుతావా?"

"ఏమో, ఇంకా ఆలోచించలేదు. మా సీనియర్స్ చాలామంది అమెరికా వెళ్ళడానికి జీఆరీ, టోఫిల్ పరీక్షలకి ప్రిపేరవుతున్నారు "

"అవునా? మరి నువ్వు? నువ్వూ ప్రిపేరవుతున్నావా?"

"నేనా? నాట్ ష్యూర్! నాకు అమెరికా వెళ్ళాలని లేదు. అమ్మనీ నాన్ననీ వొదిలి వుండలేను. ఇక్కడే ఏదైనా వుద్యోగం చూసుకుంటాను. మంచి ఉద్యోగం దొరికితే చేయాలని వుంది. రెండు మూడేళ్ళ తరవాత ఉద్యోగం బోరు కొడితే ఎంటెక్ చదువుతాను. ఎనీహౌ, ఇంకా రెండేళ్ళ చదువుందిగా. చూద్దాం ఏమవుతుందో!"

"కెమికల్ ఇంజినీరింగ్ అంటే పెట్రోలియుం ఇండస్ట్రీ, రీసెర్చి లేబొరేటరీలు, మానుఫేక్చరింగ్ యూనిట్‌లు అటువంటి చోట వుద్యోగాలు దొరుకుతాయి."

"అవును, అయితే అటువంటి చోట్ల ఆడవాళ్ళు ఉద్యోగాలు చేయలేమని మా నాన్న నన్ను కంప్యూటర్ లాంగ్వేజెస్ నేర్చుకొని సాఫ్ట్ వేర్ వైపు వెళ్ళమంటున్నాడు. కానీ, నాకు ఆ ఫీల్డులో అంత ఇంటరస్టింగ్‌గా అనిపించడంలేదు." ఆమె బిక్క మొహం చూసి నవ్వాడు అశోక్.

"అన్నట్టు అశోక్! నువ్వు నా కొత్త డ్రసు చూడనేలేదు! మొన్న పుట్టినరోజుకి మా అమ్మమ్మ కొనిచ్చింది. ఎలా వుంది?"

గలగలా నవ్వాడు అశోక్.

"చాలా బాగుంది. అసలు చూడగానే అనుకున్నా, ఇవాళ ఏదో కొత్తగా వున్నావని. ఎప్పుడు జీన్స్‌లోనే వుండేదానివి, ఇవాళ ఈ డ్రసు బాగా నప్పింది నీకు. ఇలాటి డ్రస్సు నేను అమ్మాకి ఒకటి కొంటాను!"

"థాంక్ యూ! థాంక్ యూ! కాంప్లిమెంటు కూడా అడుక్కోవాల్సి వస్తుంది," నవ్వింది భాను. టైము చూసుకుంది.

"ఇక వెళ్ళాలి అశోక్. నువ్వు మళ్ళీ హాస్టల్‌కి ఎప్పుడు వెళ్ళాలి?"

"పై సోమవారం. వచ్చే వారమంతా ఇక్కడే వుంటాను."

"సరే. మళ్ళీ ఎప్పుడు కలవడం?"

"క్రిస్మస్ సెలవులకి వచ్చినప్పుడు. అప్పుడు ఇక్కడే వుంటావా ఎటైనా వెళ్తున్నావా?"

"ఎక్కడికీ లేదు. ఈసారి నువ్వొచ్చినప్పుడు కలుద్దాం. బై."

★★★★★★★★★★★★★★

1992–జనవరి

డియర్ అశోక్,

హేపీ న్యూ ఇయర్. క్రిస్మస్, న్యూ ఇయర్ సెలవులకి నువ్వు హాస్టల్ నుంచి ఇంటికొచ్చావని తెలుసు. కానీ, నేనే ఇండస్ట్రియల్ టూరులో వున్నాను. చెన్నై, బెంగలూరు, త్రివేండ్రంలో వున్న కొన్ని మానుఫాక్చరింగ్ యూనిట్‌లు చూస్తున్నాము. హైదరాబాదు తిరిగి రావడానికి ఇంకో నాలుగు వారాలైనా పట్టొచ్చు. అప్పటినించీ ఇక పరీక్షల హడావిడి. బహుశా మనం మళ్ళీ సమ్మర్ సెలవుల్లోనే కలుస్తామేమో!

ఒక సంగతి వింటే ఆశ్చర్య పోతావు. మా ఫ్రెండ్ ఆశా లేదూ? దానికి బాంక్‌లో ఉద్యోగం వచ్చిందని ఫైనల్ ఇయర్ పరీక్షలు రాయకుండానే వెళ్ళి ఉద్యోగంలో చేరిపోతుంది. తను చదివేది బియెస్సీ కెమిస్ట్రీ! మరి బాంకు పరీక్షలు ఎందుకు రాసిందో, అది రాగానే ఈ డిగ్రీ ఎందుకు వొదిలేస్తుందో! ఎందుకో నాకు తను చేసిన పని అంతగా నచ్చలేదు. సరే, ఎవరి పరిస్థితి వాళ్ళదనుకో!

పరీక్షలకి ఎలా చదువుతున్నావు? మొదటి సెమిస్టర్ రిజల్ట్స్ ఎలా వచ్చాయి? అమ్మా, అమ్మూ ఎలా వున్నారు? నువు ఇంటి దగ్గర లేనప్పుడు వాళ్ళకేదైనా అవసరం పడితే నాకు ఫోన్ చేయమను. నంబరు కూడా ఇవ్వు.

ఇండస్ట్రియల్ టూర్ బాగుంది కానీ, ఎందుకో అన్ని ఇంజినీరింగ్ ఫీల్డ్సూ కంప్యూటర్స్ లోకే చేరిపోతున్నాయనిపిస్తుంది. నాకు ఏదైనా కెమికల్ యూనిట్‌లో ఉద్యోగం దొరికితే బాగుండు. అయినా ముందీ థర్డ్ ఇయర్ పరీక్షలు గట్టెక్కితే, అప్పుడు ఆలోచిద్దాం.

అమ్మా నాన్నా బానే వున్నారు కానీ, నాన్నకి కొంచెం పని ఎక్కువగా వుంటోంది. సినిమాలేమైనా చూసావా? కొత్త పుస్తకాలేం చదివావు?

వుండనా?

యువర్స్ ఫ్రెండ్లీ

భాను

1992–మార్చి

డియర్ భానూ,

బాగున్నావా? నీ ఉత్తరం అందింది కానీ, నువ్వు ఇండస్ట్రియల్ టూర్ ముగించి వచ్చిన తరవాతనే ఉత్తరం రాద్దామని ఆగిపోయాను. కానీ కిందటి రెండు వారాలూ ఒక ముఖ్యమైన అసైన్‌మెంటు పేపరు సబ్‌మిషన్ కోసం పనితో చాలా వొత్తిడితో వున్నాను. ఈ పేపరు కోసం ఓహెన్రీ, చెహోవ్, సోమర్‌సెట్ మాం, ముగ్గురి రచనలూ చదివి ఒక తులనాత్మక విశ్లేషణ చేయాల్సి వొచ్చింది. ఇలాటి వ్యాసాలు వ్రాయడంలో సమస్యేమిటో తెలుసా? ఎన్ని సార్లు తిరగ రాసినా, మళ్ళీ ఏవో కొత్త ఆలోచనలూ, వాక్యాలూ తడుతూనే వుంటాయి. ఇక ఏమైతే అదయిందని ఇవాళ రాత్రి ఏడింటికి అసైన్‌మెంటు మా ప్రొఫెసర్ గది తలుపుల్లోంచి కిందకి తోసేసి వచ్చాను. తీరికగా నీకు ఉత్తరం వ్రాస్తున్నాను.

మే మొదటి వారంలో రెండో సెమిస్టర్ పరీక్షలు వుంటాయి. మొన్న మొదటి సెమెస్టర్‌లో మార్కులు బానే వొచ్చాయి. మనం అక్టోబరులో బ్రిటిష్ లైబ్రరీలో కలిసిన తరవాత మళ్ళీ కలుసుకోనేలేదు కదా? దీపావళికి ఇంటికి ఒక్క రోజే వొచ్చాను.

డాన్సు ప్రాక్టీసు మొత్తానికే ఆగిపోయింది. అయితే రెండు మంచి డాన్సు ప్రోగ్రాములు ఇక్కడ ఆడిటోరియంలో జరిగాయి. మొన్న ఆదివారం టీవీలో శోభా నాయుడుగారి డాన్సు చూసాను. ముద్దు గారె యశోద పాటకు దాదాపు నలభై నిముషాల పాటు నాట్యం చేసారావిడ. నిజంగా చిన్ని కృష్ణుడు కళ్ళ ముందు కదలినట్టే అనిపించింది.

నువ్వు బాడ్‌మింటన్ రెగ్యులర్‌గా ఆడుతున్నావా?

నీ పరీక్షలెప్పుడవుతాయి? సమ్మర్ హాలిడేస్‌లో వీలైతే కలుద్దాం.

వుంటాను

అశోక్

★★★★★★★★★★★★★★★★★★★★★★

1992–ఆగస్టు

"అన్నయ్యా! ఎవరొచ్చారో చూడు!" అమూల్య తలుపు తెరిచి చూసి అరచింది.

"ఎవరే వచ్చింది?" వంటింట్లోంచి సుమిత్రా, పక్క గదిలోంచి అశోక్ ఇద్దరూ బయటికొచ్చారు.

గుమ్మం దగ్గర మొహమాటంగా నిలబడి వుంది భాను.

"అరే భానూ! వాటె సర్‌ప్రైజ్! ఏమిటిలా? రా కూర్చో!" ఆశ్చర్యంగా అన్నాడు అశోక్.

"ఆశని కలుద్దామని పక్కనే వున్న కాలనీలోకొచ్చాను. మీ ఇల్లు ఇక్కడే కదా, వుంటే కలువొచ్చని," కూర్చుంటూ అన్నది భాను.

"మంచి పని చేసావ్. కొంచెం మంచి నీళ్ళు తీసుకురా అమ్మూ!" సుమిత్ర అంది.

"నీ ఇంజినీరింగ్ అయిపోయిందా?"

"ఇంకొక్క ఇయర్ వుంది ఆంటీ. ఇప్పుడే ఫోర్త్ ఇయర్ మొదలైంది."

"అవునా? వీడిదీ ఇదొక్క సంవత్సరమే వుంది."

"అశోక్! నీకు ఎమ్మేలో కూడా గోల్డ్ మెడల్ రావాలి! బియ్యేలో లాగే!"

"అమ్మో! ఇప్పుడంత ఈజీ కాదు, భానూ, మార్కులెలా వొస్తాయో!" నవ్వేసాడు అశోక్.

"ఎమ్మే తరవాత? అయ్యేయెస్? బాంక్ ఆఫీసర్? దేనికి ప్రిపేరవుతావ్?"

" రెండూ కాదు! పీహెచ్‌డీ కి అప్లై చేస్తాను. ఇంతకు ముందే చెప్పాగా, నాకు లెక్చరర్ గా పని చేయాలని వుంది."

సుమిత్ర నిట్టూర్చింది.

"ఏమిటో వీడి చాదస్తం! ఇదిగో, ఈ పిల్ల కూడా ఎంసెట్ రాయననీ, బీకాం చదువుతాననీ అంటోంది."

అమూల్య ఇబ్బందిగా నవ్వింది.

"పోన్లెండి ఆంటీ! తనకిష్టమైన చదువు చదువుకోవడమే మంచిది కదా?"

కాసేపు కూర్చొని టీ తాగి ఇంటికెళ్ళడానికి లేచింది భాను.

"పద, బస్ స్టాపు దాకా వొస్తా." అశోక్ కూడా లేచాడు.

"వొచ్చేటప్పుడు కొంచెం మెడికల్ షాపు కెళ్ళు అశోక్," సుమిత్ర చెప్పింది ప్రిస్క్రిప్షన్ చేతికిస్తూ.

ఇద్దరూ బయటికి నడిచారు.

"అలా వున్నావేం అశోక్?"

"ఎలా వున్నాను?"

"కొంచెం చిరాగ్గా, డల్‌గా! ఎనీథింగ్ మాటర్?"

"అది కాదు భానూ! మనమెందుకు ఎప్పుడూ ఎచీవ్‌మెంట్ వెనకాలా, ఆ ఎచీవ్‌మెంట్ వల్ల మనకి లభించే గౌరవ మర్యాదల వెనకా ఎందుకలా పరిగెడతాం? నేను మామూలుగా నాకు నచ్చిన బియ్యే చదువుకుంటే సరిపోదు. దాన్లో గోల్డు మెడలో, ఆ తరవాత అయ్యేయెస్సో, బాంక్ ఆఫీసరో  అయి అందరి దృష్టిలో ఎదిగిపోవాలి."

"సారీ, అయితే నేనేనా నిన్ను చిరాకు పెట్టింది."

"నువ్వే కాదు, అంతా అంతే. మా అమ్మయితే నేను అందరిలా కాంపిటీటివ్ పరీక్షలు రాయననీ, నా గురించి గొప్పగా చెప్పుకోవడానికేమీ లేదనీ, పైగా డాన్సు క్లాసులకెళ్తాననీ చాలానే వున్నాయి అసంతృప్తులు."

"మనం గౌరవించేది ఎచీవ్‌మెంట్స్ కాదేమో అశోక్, కష్టపడే వాళ్ళనీ, కష్టపడే మనస్తత్వాన్నీ అయివుండొచ్చు. "

"అయితే అందరికంటే కష్టపడే కూలీ నాలీ జనాన్నీ గౌరవిస్తామా? లేదు, ఎందుకంటే ఉత్తి కష్టపడడం మాత్రమే కాదు, ఎంతో ఎత్తుకు ఎదిగి చూపించాలి. నాకెందుకో అది చాలా చిరాకెత్తిస్తుంది భానూ. ఇతరులకి బుద్ధి పూర్వకంగా హాని చేయకుండా, తమ పని తాము చేసుకుంటూ ప్రశాంతంగా బ్రతికే వాళ్ళని చులకనగా చూడడం ఎందుకు చెప్పు?"

"ఐ అండర్‌స్టాండ్. అయితే, ఇతరుల గౌరవాన్నీ, ఒప్పుదలనీ ఆశించి ఆగిపోవడం కూడా ఒక రకమైన బలహీనతే కదా? నువ్వు ఎలాంటి నిరాశలకీ నిస్పృహలకీ గురికాకుండా, నువ్వు చేసేది చేసుకుంటూ పో!"

"థాంక్ యూ భానూ! కొన్నిసార్లు అమ్మ డిసప్పాయింట్‌మెంటూ, బంధువుల హేళనలూ నాకు చాలా ఇరిటేటింగ్‌గా వుంటయంతే."

"సరే, నేనిక బయల్దేరుతా అశోక్. ఆటో వెతుకుదాం పద. మళ్ళీ యూనివర్సిటీకి వెళ్ళగానే ఉత్తరాలు రాస్తూ వుండు. బై."

★★★★★★★★★★★★★★★★★★★★★★★

1992– డిసెంబరు

డియర్ భానూ,

బాగున్నావా? సెమిస్టర్ పరీక్షలైపోయినయి కానీ, శివ, వెంకట్, విజయ్, నేనూ టూర్ ప్రోగ్రాం పెట్టుకున్నాం. అందుకే క్రిస్మస్, న్యూ ఇయర్ టైం లో కూడా నిన్ను కలవడం కుదరదు. సంక్రాంతి పండగ టైంలో కలుద్దాం. జనవరిలో ఇక ఆఖరి సెమిస్టర్ మొదలవుతుంది.

బాబ్రీ మస్జిద్ విధ్వంసం గురించి చదివావా? ఎంత బాధాకరమైన విషయం కదా? ఎప్పుడు లేనిది ఈ మత విద్వేషాలేమిటో కదా? మా స్కూలు ఫ్రెండ్స్ లో చాలా మంది ముస్లిములు వున్నారు. మేమంతా ఇప్పటికీ స్నేహంగానే వుంటాము. ఇప్పుడు కొత్తగా మా మధ్యన ఏదో తెలియని కొత్త కొత్త గోడలు.

మీ యూనివర్సిటీలో వాతావరణం ఎలా వుంది?

బహుశా నేను వచ్చే సెమిస్టర్ ఈ విషయం గురించే ఒక పేపర్ రాద్దామనుకుంటున్నాను.

వుంటాను. హేపీ న్యూ ఇయర్ ఇన్ అడ్వాన్స్.

నేను పరీక్షలైపోయాక నీకు ఫోన్ చేస్తాను.

వుంటాను

అశోక్.

★★★★★★★★★★★★★★★★★★★★

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS